

విద్యార్థులకు బెల్ట్‌గ్రేడ్ అవార్డులను అందజేస్తున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే దోహదం

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆత్మ రక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే ఎంతగానో దోహదపడుతోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు, జాతీయ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అంతర్జాతీయ కరాటే కోచ్ రెన్షి సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శక్తి కరాటే చాంపియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 3వ కరాటే బెల్ట్ గ్రేడ్ అవార్డింగ్ వేడుక మన్సూరాబాద్ డివిజన్ ఎస్‌కే గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రెన్షి సీహెచ్ శ్రీనివాసరావులు నిర్వాహకుడు, అకాడమీ వ్యవస్థాపకుడు వి.శ్రీకాంత్‌చారితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన కరాటే ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభకనబర్చిన వారికి బెల్ట్ గ్రేడ్, అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎస్ఐ ప్రమోద్, బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి ఎడ్ల అమరేశ్వర్ ముదిరాజ్, సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ విక్రాంత్ తెరల్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భజన పోటీల్లో కవాడిపల్లికి ద్వితీయ బహుమతి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సౌజన్యంతో భజన భారతి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన భజన పోటీల్లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన భజన మండలికి ద్వితీయ బహుమతి దక్కింది. నగరంలో నిర్వహించిన ఈ భజన పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు మూడు వందల భజన బృందాలు పాల్గొన్నట్లు కవాడిపల్లి భజన మండలి సభ్యుడు సుర్వి విఘ్నేశ్వర్‌గౌడ్ తెలిపారు. పోటీల అనంతరం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ చేతుల మీదుగా కవాడిపల్లి భజన మండలి సభ్యులు ద్వితీయ బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కవాడిపల్లి భజన మండలి రెండవ స్థానం దక్కించుకోవడం పట్ల గ్రామస్థులు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులను అభినందించారు.



మొక్కను నాటుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

హయత్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ రంగనాయకులగుట్టకాలనీ అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారంలో కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి సోమవారం పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో కానుగు మహేష్, నాగరాజు, రాజు, లక్ష్మణ్, కమలానవీన్, ప్రమోద్, కార్తీక్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అవసరం



గ్రానైట్ మార్బుల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

చంపాపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని హనుమాన్ ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని నవగ్రహాల ఆలయం నుంచి దుర్గామాత ఆలయం వరకు దాత బాలకృష్ణ సహకారంతో గ్రానైట్ మార్బుల్ నిర్మాణ పనులకు ఆలయ చైర్మన్ సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దాత బాలకృష్ణ, ధర్మకర్తలు తోకటి కిరణ్‌కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, కొండ్ర సంతోష్‌కుమార్, అంబప్రసాద్, ఆలయ సిబ్బంది రమాదేవి, వెంకటయ్య, శ్రీనివాస్, సుజాత పాల్గొన్నారు.

బీజేపీ వనస్థలిపురం డివిజన్ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ వనస్థలిపురం డివిజన్ నూతన కమిటీ ఎన్నికైంది. ఇటీవల అధ్యక్షుడిగా కాటం క్రాంతిగౌడ్ నియామకం కాగా ఇతర కమిటీ సభ్యులను సోమవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గంగాపురం రామాంజనేయులుగౌడ్, దాసోజు దయాకర్‌చారి, బొడ్డుపల్లి వెంకటేశ్ కురుమ, కొత్త అభినందన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా ఆది నర్సింహారావు, అరుణ్‌కుమార్ జోగి, చీల రోజాగుప్తా, కార్యదర్శులుగా పోరెడ్డి రాంరెడ్డి, బంటు అశోక్, గోపీనాయక్, పురం రక్షిత్‌రెడ్డి, కోశాధికారిగా అశోక్ వాగ్మోడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కంచ అనిల్ కుమార్‌గౌడ్, యువమోర్చా అధ్యక్షుడిగా నీల హరిచరణ్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా క్రాంతిగౌడ్ మాట్లాడుతూ బీజేపీ పటిష్టతకు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింతగా కష్టపడి పనిచేయాలని సూచించారు.

బీసీ యునైటెడ్ ఫ్రంట్ సమావేశం

మన్సూరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం ఎల్బీనగర్ చింతల్‌కుంటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్ర గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చీమలు శ్రీనివాస్, భూజగోని వెంకటరామయ్య, కార్యదర్శి వాసు కే యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా సిలివేరు గాలయ్య, మారపంగు వెంకన్న, ట్రెజరర్‌గా విద్యారాణిలను నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కమిటీ సభ్యులకు రాఘవేంద్రగౌడ్ సూచించారు.



వేలంలో దక్కించుకున్న లడ్డూతో జైలు సూపరింటెండెంట్ శివకుమార్, మహిళలు

వేలంలో లడ్డూను దక్కించుకున్న చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కార్యాలయంలో నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలం పాటలో చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ రూ.19,600లకు లడ్డూ దక్కించుకున్నారు. సమాజంలో మంచి మార్పు కోసం నిరంతరం కృషి చేస్తున్న సంస్థ యూత్ ఫర్ యాంటీ కరప్షన్ అని, వీరు వెళ్లే మార్గంలో భగవంతుడి ఆశీస్సులు కూడా ఉండాలని కోరారు. ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ లడ్డూ వేలం పాటలో చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ దక్కించుకోగా, మరో లడ్డూను గీతానందర్, శరణ్యలు రూ.15,400లకు దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డా.స్రవంతి. కొన్నె దేవేందర్, గంగాధర్, బి. రాజేశ్, స్వప్న, సంధ్యారాణి, వంశీకృష్ణ, నాగేంద్ర, రాజేశ్, నరేశ్, శివనాగరాజు పాల్గొన్నారు.



వాసవీకాలనీలో గణనాథుడిని దర్శించుకున్న తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, చిలుక మధుర రెడ్డి, ధనలక్ష్మి, రత్నమాల, విజయ, సుజాత



ప్రశాంత్‌నగర్‌లో గణేశుడి వద్ద పూజల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, లగ్గాని శ్రీధర్‌గౌడ్



సాగర్‌కాంప్లెక్స్‌లో వినాయకుడి పూజల్లో పాల్గొన్న అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాలే జగన్నాథం తదితరులు



భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు

జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి : గణపతి నవరాత్రి ఉత్సవాలను మలక్‌పేట్, సైదాబాద్, సంతోష్‌నగర్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, దిల్‌సుఖ్‌నగర్, మూసారాంబాగ్, మన్సూరాబాద్, ఎల్బీనగర్, చంపాపేట, కర్మన్‌ఘాట్, హయత్‌నగర్, వనస్థలిపురం, హస్తినాపురం, బీఎన్‌రెడ్డినగర్, నాగోల్, కొత్తపేట, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్ పరిసర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. అందంగా ముస్తాబు చేసిన మండపాలలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. పలు మండపాలలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కుంకుమార్చనలు, అన్నదానాలు చేశారు. మండపాల వద్ద పోలీసులు విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్న సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచందర్‌రెడ్డి

బాలాపూర్ వినాయకుడిని దర్శించుకోవడం మహాభాగ్యమని, లడ్డూ ప్రసాదం వేలంతో ప్రసిద్ధి పొందిన ఇక్కడి విఘ్నేశ్వరుడు ఎంతో మహిమాన్వితుడని సీడబ్ల్యూసీ మెంబర్, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తదితరులతో కలిసి బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం వంశీచంద్ మాట్లాడుతూ నవరాత్రి వేడుకల నిర్వహణలో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి పర్యవేక్షణ, పనితీరు, ఓపిక, సహనం ప్రశంసనీయమని అన్నారు.



గడ్డిఅన్నారంలో గణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క, భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులు



లక్ష్మీనగర్‌కాలనీ మండపంలో ఉపాధ్యాయులతో చిన్నారులు, మండప నిర్వాహకులు బాలకృష్ణ, మల్లేష్‌గౌడ్



దిల్‌సుఖ్‌నగర్ వెంకటాద్రి ట్రేడర్స్ అసోసియేషన్‌లో అన్నదానంలో మాజీ కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి



గడ్డిఅన్నారంలో గణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి



ఆటోనగర్‌లో గణనాథుడిని దర్శించుకున్న ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను సన్మానిస్తున్న ఎండీ సలావుద్దీన్, శ్రీధర్‌రెడ్డి



మన్సూరాబాద్ హైవేకాలనీలో బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డితో కలిసి గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి



బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి



అల్మాస్‌గూడలో విఘ్నేశ్వరుడి పూజల్లో పాల్గొన్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి, ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి



అనాజ్‌పూర్‌లో వినాయకుడి పూజల్లో పాల్గొన్న గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు



హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీరోడ్డులో గణేశ్ ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ సుజాతానాయక్, నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి



ఓల్డ్‌మలక్‌పేటలో వినాయకుడికి పూజలు చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ షకీల్



రూ.3,11,111కు మన్సూరాబాద్ శ్రీరామహిల్స్‌కాలనీ స్నేహ హైట్స్ అపార్ట్‌మెంట్‌లోని గణనాథుడి లడ్డూని కైవసం చేసుకున్న ఎస్.ప్రవీణ్‌కుమార్



మన్సూరాబాద్ పెద్దచెరువు బేబీపాండ్‌లో ఓ వైపు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తుండగా మరోవైపు ఎప్పటికప్పుడు తొలగిస్తున్న దృశ్యం

బీజేపీ ఓబీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటాచారి

చంపాపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ సెల్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడిగా శ్రీరామ అయోధ్యనగర్ కాలనీకి చెందిన ఆందోజు వెంకటాచారి నియమితులయ్యారు. బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి చేతుల మీదుగా సోమవారం వెంకటాచారి నియామకపత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, నాయకులకు వెంకటాచారి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్

బీజేవైఎం హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్ నియమితులయ్యారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి చేతుల మీదుగా మల్లేషయాదవ్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీజేవైఎం బలోపేతం కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

మానసికస్థితి సరిగ్గాలేని యువతిని పోలీసులు చేరదీత

చాదర్‌ఘాట్ : మానసికస్థితి సరిగ్గా లేని కారణంగా మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో సంచరిస్తున్న యువతిని చాదర్‌ఘాట్ పోలీసులు సోమవారం గుర్తించి చేరదీశారు. యువతి తన పేరు స్రవంతి అని తండ్రి పేరు రాజు అని కర్మన్‌ఘాట్ నివాసి అని మాత్రం చెప్పినట్లు పోలీసులు వివరించారు. కుటుంబీకుల వివరాలు, మొబైల్ నంబర్ తెలపడం లేదన్నారు. యువతికి సంబంధించిన కుటుంబీకులు ఎవరైనా ఉంటే చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో నేరుగా గాని, 8712661266 ద్వారాగాని, 8712660527 ద్వారా సంప్రదించవచ్చని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారీ తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్లలో ప్రభుత్వం వైఫల్యం : బీజేపీ



సరూర్‌నగర్‌చెరువు కట్టపై నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు శ్రీవాణిఅంజన్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఏర్పాట్లలో ప్రభుత్వం వైఫల్యమైందని బీజేపీ కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణిఅంజన్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సరూర్‌నగర్‌చెరువు కట్టపై నిమజ్జన ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జన ఏర్పాట్లలో అనేక లోపాలున్నాయన్నారు. నామమాత్రంగా సమావేశాలను నిర్వహిస్తు చాయ్, బిస్కట్లకు పరిమితమవుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పనులు చేపట్టడం లేదన్నారు. చెరువులో పూడికతీత చేపట్టకపోవడంతో ఒక్క అడుగు విగ్రహాలు కూడా సరిగా నీళ్లలో మునగడం లేదన్నారు. దీంతో రాబోయే రోజుల్లో పెద్ద విగ్రహాలు నిమజ్జనం చేయడం ఎంత కష్టమో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, చిలుకూరి రాంరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ

మన్సూరాబాద్ : నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు తస్కరించి పరారైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ మండలం గౌరెల్లి గ్రామానికి చెందిన వీరమ్మ(65) సోమవారం మధ్యాహ్నం ఆధార్ అప్‌డేట్ కోసం గ్రామంలోని మీ సేవ కేంద్రానికి వెళ్లి వస్తుంది. ఈ క్రమంలో పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెను అనుసరిస్తూ వచ్చి మెడలోని మూడు తులాల బంగారు గొలుసును తస్కరించి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీలు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి చోరీ జరిగిన తీరుపై ఆరా తీశారు. వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురి అరెస్ట్

వనస్థలిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులను వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలకుంట జాంగీర్‌నగర్‌కు చెందిన వనం పవన్(19) కొంత కాలంగా చింతలకుంట వద్ద టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి టిఫిన్ సెంటర్ వద్దకు టిఫిన్ చేయడానికి బోడుప్పల్‌కు చెందిన రాపోలు రాకేష్(30), గుండవల్లి ప్రసాద్(32)లు వచ్చారు. ఇదే సమయంలో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఆర్. లింగం, హోంగార్డు ఎం.యాదయ్యలు వచ్చి టిఫిన్ సెంటర్‌ను మూసి వేయాలని సదరు నిర్వాహకుడు పవన్‌కు సూచించారు. దీంతో టిఫిన్ చేయడానికి వచ్చిన రాకేష్, ప్రసాద్‌లు ఇద్దరు సదరు పోలీస్ సిబ్బందితో మాట మాట పెరిగింది. దీంతో పోలీస్ సిబ్బందిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసిన ఇద్దరు వ్యక్తులతో పాటు, నిర్ణీత సమయంలో టిఫిన్ సెంటర్‌ను మూసివేయని టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు వనం పవన్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

చంపాపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ అన్నారు. హఫీజ్‌బాబానగర్, ఓమర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం స్థానిక పోలీసులు, ఆర్ఏఎఫ్ దళాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించ వద్దని ప్రజలను కోరారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పెట్రోకార్, బీసీస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హఫీజ్‌బాబానగర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఆర్ఏఎఫ్ దళాలు, పోలీస్ సిబ్బంది



మాదన్నపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

మాదన్నపేటలో..

సైదాబాద్ : వినాయక నవరాత్రులు, రాబోయే మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని ఆదివారం రాత్రి మాదన్నపేట పోలీస్‌స్టేషన్ కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి సైదాబాద్ ఏసీపీ సోము వెంకట్‌రెడ్డి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ముందుగా మాదన్నపేట పీఎస్ నుంచి ప్రారంభమైన మార్చ్ మండీ, భరత్‌నగర్, రెయిన్‌బజార్‌ల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల్లో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు భరోసా కలిగించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్చ్‌లో మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ పి. ఆంజనేయులు, డీఐ దాసు, ఎస్ఐలు శోభ, వెంకటరమణ, తహెరుద్దీన్ పాల్గొన్నారు.



చాదర్‌ఘాట్‌లో ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ సుబ్బిరామిరెడ్డి

మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో..

చాదర్‌ఘాట్ : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు ఒకే సారి రావడంతో అన్నివర్గాల ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ పోలీసులు మీ వెంటే ఉన్నారంటూ భరోసా కల్పించేలా మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ ఆదేశాల మేరకు మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా ఉండాలని, పుకార్లను నమ్మవద్దని ఏసీపీ సుబ్బిరామిరెడ్డి తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి: సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి భవానీనగర్‌కు చెందిన తిరుమల మైథిలి గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితి బాగలేక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే వారి చికిత్సకు కావాల్సిన ఆర్థిక సహాయం వివరాలతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేశారు. దీంతో రూ.2,50,000 ఎల్ఓసీ మంజూరు చేశారు. ఆ ఎల్ఓసీని ఎమ్మెల్యే సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సదానంద్ రెడ్డి, పల్లం శ్రీనివాస్, ఫనిష్ తదితరులు పాల్గొన్నారు.

పదాధికారులకు నియామక పత్రాలు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పూర్తిస్థాయి కమిటీని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ సోమవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా పిల్లి బాలమల్లేష్‌యాదవ్‌ను గతంలోనే ప్రకటించగా ఉపాధ్యక్షులుగా ఎరుకల సురేష్‌గౌడ్, కొలన్ దామోదర్‌రెడ్డి, మిరియాల జగదీష్, రాజీవ్ శంక్వాల్, ప్రధాన కార్యదర్శులుగా బద్దం శ్రీకాంత్‌రెడ్డి, పిల్లి అరవింద్‌యాదవ్, కార్యదర్శులుగా పోతురాజు మమత, తంగెడుపల్లి ప్రేమలతరెడ్డి, బత్తిని రాంప్రసాద్‌గౌడ్, గుర్రం శ్రీధర్‌రెడ్డి, కోశాధికారిగా అనంతుల సాయికిరణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పదాధికారులకు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పర్వతి బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు సిద్దంకి జగన్‌మోహన్‌రెడ్డి, కొత్తపల్లి ధన్‌రాజ్‌రెడ్డి, నూకల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో తెలుగోళ్ల అష్టావధానం



అష్టావధాన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ఎన్ఆర్ఐలు

సరూర్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జనరంజని రేడియో సంస్థ, శ్రీవేదగాయత్రీ పరిషత్, సంగీత భారతీ న్యూజిలాండ్ సంస్థల ఆధ్వర్యంలో శనివారం తెలుగులో అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్ట్రేలియా అవధాని, అవధానార్చనా భారతి, కవి రాజహంస తటపర్తి కళ్యాణచక్రవర్తి ఈ కార్యక్రమంలో పాల్గొని అష్టావధానం చేసి అందరిని అబ్బుర పరిచారు. న్యూజిలాండ్‌లో తొలి శతకకర్తగా రికార్డు సాధించిన డాక్టర్ తంగిరాల నాగలక్ష్మి సంచాలకురాలిగా వ్యవహరించారు. సమస్య, దత్తపది, వర్ణన, నిషిద్ధాక్షరి, న్యస్తాక్షరి, ఆశువు, కృతి పద్యం, చిత్రానికి పద్యం, అప్రస్తుత ప్రసంగం తదితర విభిన్న అంశాలతో ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది. పలువురు చిన్నారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని అవధానిని పలు తికమక ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తెలుగుభాష గొప్పతనాన్ని తెలియజేయడానికి, సాహిత్యాభిమానాన్ని చాటుకోవడానికి గాను ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు.